ఇండస్ఇండ్ పరిస్థితి మెరుగ్గానే

డిపాజిటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

స్పష్టంచేసిన రిజర్వుబ్యాంక్

ముంబై, మార్చి 15: ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్ఇండ్ బ్యాంక్ లెక్కల్లో వచ్చిన రూ.2,100 కోట్ల తేడాపై రిజర్వు బ్యాంక్ దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉన్నదని మార్కెట్లో గుప్పుమన్న వార్తలపై సెంట్రల్ బ్యాంక్ స్పందించింది. బ్యాంక్ ఆర్థిక పరిస్థితికి వచ్చిన ఢోకా ఏమీ లేదని, డిపాజిటర్లు, ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చింది. ప్రస్తుతం బ్యాంక్‌లో నెలకొన్న పరిస్థితులను సమీక్షించడానికి, అకౌంటింగ్ తప్పిదాలపై వాస్తవ పరిస్థితులను త్వరగా అంచనావేయడానికి ఇప్పటికే బ్యాంక్ ప్రత్యేకంగా ఆడిట్ బృందాన్ని నియమించినట్లు ఆర్బీఐ పేర్కొంది. ఈ ప్రత్యేక ఆడిట్ బృందం ఈ నెల చివర్లో లేదా వచ్చే నెల తొలివారంలో తన నివేదికను సమర్పించనున్నదని పేర్కొంది. ఈ నివేదిక ఆధారంగా బ్యాంక్‌పై చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ప్రస్తుతం ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బ్యాంక్ ఆర్థిక మూలాలు దృఢంగా ఉన్నాయని, క్యాపిటల్ అడక్వసీ రేషియో 16.46 శాతంగాను, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 70.20 శాతంగా ఉన్నదని పేర్కొంది.

రంగంలోకి ఐసీఏఐ

ఇండస్ఇండ్ బ్యాంక్ ఖాతాల్లో నెలకొన్న అవకతవకలపై నిగ్గు తేల్చడానికి చార్టర్డ్ అకౌంటెంట్ సంఘం ఐసీఏఐ రంగంలోకి దిగింది. రూ.2,100 కోట్ల వరకు లెక్కల్లో వ్యత్యాసంపై ఐసీఏఐ ప్రత్యేక దృష్టి సారించింది. బ్యాంక్ ఆర్థిక రిపోర్టింగ్ బోర్డ్ ఇచ్చిన సమీక్షపై ఐసీఏఐ ప్రత్యేకంగా సమీక్షించి త్వరలో రిజర్వుబ్యాంక్‌కు తన నివేదికను సమర్పించనున్నది. బ్యాంక్‌లో అకౌంటింగ్ స్టాండర్డ్స్, ఆడిటింగ్, కంపెనీల చట్టం-2013 ప్రకారం షెడ్యూల్ 2, 3 పై కూడా ప్రత్యేకంగా చర్చించనున్నది. మరోవైపు, గడిచిన ఫారెక్స్ లావాదేవీలకు సంబంధించి హెడ్జింగ్ ఖర్చుల్ని బ్యాంక్ తక్కువగా అంచనా వేసినట్టు ఓ అంతర్గత సమీక్షలో తేలింది. బ్యాంకులో పాలనాపరమైన లోపాలున్నాయన్న దానిపై కూడా ఐసీఏఐ దృష్టి సారించనున్నది. గత వారం బ్యాంక్ సీఈవో, ఎండీ కత్‌పాలియా పదవీకాలాన్ని మూడేండ్లకు పెంచుతూ ఇండస్ఇండ్ బ్యాంక్ బోర్డు ప్రతిపాదించినా, ఆర్బీఐ మాత్రం ఏడాదికే అనుమతిచ్చింది.

ఎంఎస్ఎంఈలపై ప్రభుత్వం శీతకన్ను

కాగితాలకే పరిమితమైన నూతన పాలసీ

ఇతర రాష్ట్రాలతో మార్కెటింగ్ సమస్యలు

హైదరాబాద్, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ఉపాధి రంగానికి ఆయువు పట్టైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) రంగం తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నది. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పారిశ్రామిక అనుకూల విధానాలతో ఎంఎస్ఎంఈ రంగం ఎంతగానో వృద్ధి చెందింది. ఇంజినీరింగ్, కెమికల్స్, మెటల్, ఆహార ఉత్పత్తులు రాష్ట్ర అవసరాలను తీర్చడంతోపాటు ఇతర రాష్ట్రాలకు కూడా ఎగుమతి అయ్యేవి. అయితే గత కొంతకాలంగా గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి తీవ్ర పోటీ ఏర్పడినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అక్కడి ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల తక్కువ ధరకే వారు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహకాలను పూర్తిగా విస్మరించడం వల్ల ఆయా రాష్ట్రాల పోటీని తట్టుకునే పరిస్థితి లేకుండా పోయిందని వారు పేర్కొంటున్నారు. ఈ రంగాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త ఎంఎస్ఎంఈ-2024 పాలసీ కాగితాలకే పరిమితం కావడంతోపాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందకపోవడంతో చిన్న..చితక సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

గిరాకీ అంతంతే..

ఎంఎస్ఎంఈ ఉత్పత్తులకు గిరాకీ లేకుండా పోతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి పోటీ తీవ్రతరం కావడంతో కొనేవాళ్లు కరువయ్యాయని పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో ప్రధానంగా ఆహార పదార్థాలు, కెమికల్స్, మెటల్ ఉత్పత్తులు, ఎలక్ట్రికల్ యంత్రాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, రబ్బర్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, అల్లిక-దుస్తుల ఉత్పత్తులు తయారవుతున్నాయి. ఉత్తరప్రదేశ్ నుంచి ఆహార పదార్థాల నుంచి పోటీ ఎదురవుతుండగా.. మహారాష్ట్ర, గుజరాత్ నుంచి ప్లాస్టిక్, కెమికల్స్, తమిళనాడు నుంచి యంత్రాలకు పోటీ ఎదురవుతున్నదని చెబుతున్నారు. ఉత్పత్తి వ్యయంకన్నా తక్కువ ధరకు ఆయా రాష్ట్రాలు మార్కెటింగ్ చేస్తున్నాయని, దీనివల్ల ఉత్పత్తులు అమ్ముకోలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వారు వాపోతున్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ కూడా రంగంలోకి దిగిందని, ఆయా రాష్ట్ర ఉత్పత్తులను తెలంగాణలో ప్రమోట్ చేయడానికి ఆ రాష్ట్రం పెద్ద ఎత్తున తాయిలాలు ప్రకటిస్తున్నది. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు ఫార్మా, ఆహార ఉత్పత్తుల పరిశ్రమలను ఆకర్షించేందుకు తరచూ రాష్ట్రంలోని పరిశ్రమ వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఓ వైపు రాష్ట్రంలో పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, మరోపక్క ఇతర రాష్ట్రాలు పిలుస్తుండడంతో ఎంఎస్ఎంఈలు పక్క రాష్ట్రాలకు వెళ్లే అనివార్య పరిస్థితులు ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఎంఎస్ఎంఈల అభివృద్ధి..

- ***2,500 ఎకరాల్లో 28 పారిశ్రామికవాడల ఏర్పాటుతోపాటు 12 పారిశ్రామిక వాడల అప్‌గ్రేడేషన్, మరో 6 కొత్త పార్కుల ప్రతిపాదన***
- *దేశంలో ఎక్కడా లేనివిధంగా సుమారు 500 ఎకరాల్లో గ్రీన్ ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు. ఇందులో దాదాపు రూ.1,500 కోట్ల పెట్టుబడులతో 450 పరిశ్రమలు ఏర్పాటుకాగా, వీటిద్వారా 35 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి.*
- ***2014 నుంచి సుమారు 20 వేల ఎంఎస్ఎంఈలు కొత్తగా నమోదు చేసుకున్నాయి. దీంతో మొత్తం సంఖ్య 26 లక్షలకు చేరుకున్నాయి.***
- *ప్రస్తుతం రాష్ట్రంలో ఈ చిన్న-చితక సంస్థలు మొత్తంగా రూ.31 వేల కోట్ల పెట్టుబడులు పెట్టాయి.*
- ***ఈ విభాగంలో ఉపాధి పొందుతున్నవారి సంఖ్య దాదాపు 40 లక్షలు***
- *2014-2023 మధ్యకాలంలో ఎంఎస్ఎంఈల వార్షిక వృద్ధిరేటు 11 శాతం నుంచి 15 శాతానికి చేరుకున్నది.*

రికార్డుస్థాయిలో ఒప్పందాలు

ఫిబ్రవరిలో 7.2 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ, మార్చి 15: దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఒప్పందాలు, విలీనాలు జరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి వృద్ధిని నమోదు చేసుకుంటుండటంతో కార్పొరేట్ సంస్థలు భారీ స్థాయిలో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. గత నెలలో 226 విలీనాలు-కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 7.2 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయని గ్రాంట్ థార్టన్ భారత్ పేరుతో విడుదల చేసిన నివేదికలో డీల్‌ట్రాకర్ వెల్లడించింది. ఒప్పందాల పరంగా చూస్తే 67 శాతం అధికమవగా, విలువ పరంగా చూస్తే 5.4 రెట్లు పెరిగాయి. వీటిలో 85 విలీనాలు అండ్ కొనుగోళ్లు జరగగా, వీటి విలువ 4.8 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నదని పేర్కొంది. ఒప్పందాల్లో జెన్ టెక్నాలజీ, నిట్కో లిమిటెడ్‌లు నాలుగు కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి. దీంతోపాటు ఓఎన్‌జీసీ-ఎన్‌టీపీసీ గ్రీన్ 2.3 బిలియన్ డాలర్లతో అయాన రెన్యూవబుల్ పవర్‌ను కొనుగోలు చేశాయి. అలాగే ప్రణా గ్రూపు 755 మిలియన్ డాలర్లతో ఒవెన్స్ కార్నింగ్స్ గ్లాస్‌ను కొనుగోలు చేసింది. ప్రైవేట్ ఈక్విటీ ఒప్పందాలు 141 జరగగా, వీటి విలువ 2.4 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నది.

షియోమీ 15 సిరీస్ ఫోన్లు

ప్రారంభ ధర రూ.64,999

నూఢిల్లీ, మార్చి 15: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీ..దేశీయ మార్కెట్లోకి సరికొత్త సిరీస్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 15 సిరీస్‌లో భాగంగా విడుదల చేయనున్న ఈ ఫోన్లు అడ్వాన్స్‌డ్ కెమెరా స్మార్ట్‌ఫోన్లతో తీర్చిదిద్దింది. వీటిలో షియోమీ 15 ధర రూ.64,999గా నిర్ణయించిన సంస్థ.. షియోమీ 15 అల్ట్రా మాడల్ ధర రూ.1,09,999కి విక్రయిస్తున్నది. ఈ రెండు ఫోన్లు అమెజాన్‌లో వచ్చే నెల నుంచి అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది. 6.36 అంగుళాల క్రిస్టాల్‌రేస్ డైనమిక్ 1-120 అమోలెడ్ టచ్‌స్క్రీన్‌తో తయారు చేసిన ఈ ఫోన్‌లో 14 ఎంఎం నుంచి 120 ఎంఎం ఫోకల్ లెంథ్‌తో మూడు కెమెరాలు, 50 మెగాపిక్సెల్ లైకాకెమెరా, 5240 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి. 19 నుంచి ముందస్తు బుకింగ్‌లు ఆరంభిస్తున్నట్లు ప్రకటించింది.

కొనసాగుతున్న ఎఫ్ఐఐల అమ్మకాలు

ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.64 లక్షల కోట్లు వెనక్కి



న్యూఢిల్లీ, మార్చి 15: దేశీయ ఈక్విటీ మార్కెట్లపై విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులలో ఆందోళనలో ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీగా తమ పెట్టుబడులను తరలించుకుపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.64 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకున్నారు. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, వాణిజ్య యుద్ధాలు మరింత తీవ్రతరం కావడం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. మరోసారి అమెరికా ఆర్థిక మాంద్యంలోకి జారుకుంటున్నట్లు వచ్చిన వార్తలతో ఎఫ్ఐఐలు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లించారు. దీనికి తోడు ఆటోమొబైల్, ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడం కూడా ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకోవడానికి ప్రధాన కారణమని రెలిగేర్ బ్రోకింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు. బ్యాంకింగ్ రంగ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని, దీంతోపాటు రియల్టీ, ఆటో, మెటల్ సూచీలు కూడా పతనం చెందడం వారి ఆందోళనను తీవ్రతరం చేసింది.

ఆదుకున్న డీఐఐలు

ఒకవైపు ఎఫ్ఐఐలు భారీ స్థాయిలో నిధులను తరలించుకుపోతుంటే మరోవైపు దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను కుమ్మరించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఈక్విటీల్లోకి రూ.1.77 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టారు. కొత్తగా ఈక్విటీ మార్కెట్లోకి పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య పెరగడం కూడా ఇందుకు పరోక్షంగా కారణమయ్యాయి.

తగ్గిన పసిడి రిజర్వులు

గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన విదేశీ మారకం నిల్వలు ఎట్టకేలకు పెరిగాయి. ఈ నెల7తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 15.26 బిలియన్ డాలర్లు ఎగబాకి 653.96 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గత రెండేండ్లలో ఒకేవారంలో ఇంతలా పెరగడం ఇదే తొలిసారి. అంతక్రితం వారంలో రిజర్వులు 1.781 బిలియన్ డాలర్లు కరిగిపోయి 638.698 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతవారంలో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 13.993 బిలియన్ డాలర్లు ఎగబాకి 557.282 బిలియన్ డాలర్లకు చేరుకోగడం ఇందుకు కారణం. కానీ, బంగారం నిల్వలు మాత్రం కరిగిపోయాయి. గతవారంలో 1.053 బిలియన్ డాలర్లు తగ్గి 74.325 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది.

ఈ-కామర్స్ దిగ్గజాలకు షాక్

న్యూఢిల్లీ, మార్చి 15: ఈ-కామర్స్ దిగ్గజ సంస్థలకు బీఐఎస్ షాకిచ్చింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లకు చెందిన గిడ్డంగులపై దాడులు చేసి..వేలాది సంఖ్యలో ధృవీకరించబడని వినియోదారుల ఉత్పత్తులను సీజ్ చేసినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఈ నెల 7న లక్నోలోని అమెజాన్ గిడ్డంగుల్లో తనిఖీ చేసి 215 టాయ్స్, 24 హ్యాండ్ బ్లెండర్ల ఉత్పత్తులను సీజ్ చేసింది. అలాగే ఢిల్లీలో అమెజాన్‌కు ఉన్న గిడ్డంగిలో 58 అల్యూమినియం రేకులు, 34 మెటాలిక్స్ వాటర్ బాటిళ్లు, 25 ఆటబొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పీవీసీ కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్లు సీల్ చేసింది. వీటికి సంబంధించి ఎలాంటి కాగితాలు లేవని బీఐఎస్ గుర్తించింది. అలాగే ఫ్లిప్‌కార్ట్ గిడ్డంగిలో 534 స్టెయిన్‌లెస్ స్టీల్ వాక్యూమ్, 134 ఆటబొమ్మలు, 41 స్పీకర్లు సీల్ చేసినట్లు బీఐఎస్ వర్గాలు వెల్లడించాయి.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో మధుసూదన్

పనితీరును మెరుగుపరుచుకోవాలి

భూపాలపల్లి రూరల్, మార్చి 15 : టార్గెట్స్, అచీవ్‌మెంట్స్ చూసుకొని పనితీరును మెరుగుపరుచుకోవాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ అన్నారు. శనివారం ఐడీవోసీ కార్యాలయంలో జిల్లాలో కొనసాగుతున్న వైద్యసేవల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ ఆక్టివిటీస్, ఓపీ, సర్వీస్ డెలివరీ, ఆరోగ్య శివిర్, ఆబహా, ఈ-సంజీవిని, టెలీ మానస్, హెచ్ఎంఐఎస్, ఏఏఎం పోర్టల్, మెడిసిన్ అవైలబిలిటీ, హెల్త్ డేస్ యాక్టివిటీస్, తదితర వాటిపై ఆయన చర్చించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

మాదిగలకు మంత్రి పదవులు ఇవ్వాలి

ఏటూరునాగారం, మార్చి 15 : మంత్రి వర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి చోటు కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు వావిలాల స్వామి డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణపై కొనసాగుతున్న నిరసన దీక్షా శిబిరాన్ని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్దన్, నాయకులు శనివారం సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ అత్యధికంగా జనాభా కలిగిన మాదిగలకు ఎందుకు మంత్రి పదవులు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ సంఘం, నాయకపోడు సేవా సంఘం నాయకులు బొల్లెం సారయ్య, వావిలాల సాంబశివరావు, లక్ష్మీకాంత, అనసూర్య, సురేశ్, దేపాక సతీశ్, వాసంపల్లి విజయ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబాని ఆర్థిక సాయం

వాజేడు, మార్చి 15 : మండలంలోని సుందరయ్య కాలనీ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అక్కిశెట్టి ఏసు ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. శనివారం జరిగిన దశ దినకర్మకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి హాజరై ఏసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.8వేల ఆర్థిక సాయం అందించారు.నాయకులు జానకీరమణ, లక్ష్మీనారాయణ, శ్రీను, కేదరేశ్వర్ పాల్గొన్నారు.

గుడి సేవకురాలిపై దాడి

కృష్ణ కాలనీ, మార్చి 15: జిల్లా కేంద్రంలోని హనుమాన్ నగర్ ఊర పోచమ్మ గుడివద్ద సేవకురాలిగా పని చేస్తున్న చాకలి ఎస్సీ సాధన కమిటీ జిల్లా అధ్యక్షురాలు గోపరాజు సాంబలక్ష్మిపై శనివారం పలువురు దాడి చేశారు. బాధితురాలి కథనం ప్రకారం.. ఊర పోచమ్మ గుడి వద్ద తాను 30 ఏళ్లుగా పని చేస్తున్నానని, కొంతమంది ఈ గుడి వద్ద సేవలు చేయొద్దని బెదిరింపులకు గురి చేశారన్నారు. అయినప్పటికీ తానే గుడి వద్ద సేవలు చేస్తానని చెప్పానన్నారు. రోజువారి లాగానే శనివారం గుడికి రాగా కొంతమంది వ్యక్తులు వచ్చి తనపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తన బంగారు పుస్తెలతాడు తెగి ఎక్కడో పడిపోయిందని, గాయాలతో ఉన్న తనను అక్కడే ఉన్న కొంతమంది ఆస్పత్రికి తరలించారని తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, వారితో నాకు ప్రాణభయం ఉందని తెలిపారు.

విద్యుత్‌ఘాతంతో రేకుల ఇల్లు దగ్ధం

వాజేడు, మార్చి 15 : మండలంలోని పాయబాట్ల గ్రామంలో కట్ట పుష్పకుమారికి చెందిన రేకుల ఇంటిలో శనివారం రాత్రి ఫ్రిడ్జ్ పేలి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బట్టలు, బీరువా, వస్తువులు కాలిపోయాయి. సంఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చూట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకొని కాలిపోయిన వస్తువులను పరిశీలించిన బాధితులు కాలిపోయిన వస్తువుల విలువ రూ.50వేలు ఉంటుందని తెలిపారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకే ఏఐ

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 15 : అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యా బోధన ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శనివారం భూపాలపల్లి మండలం గుర్రంపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ఏఐ విద్యాబోధన కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఏఐ విద్యా బోధన కార్యక్రమం నిర్వహణపై ఈ నెల 11న రాష్ట్ర స్థాయిలో ఒక రోజు క్వాలిటీ కో-ఆర్డినేటర్స్, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కృత్రిమ మేధతో విద్యా బోధన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో విద్యార్థులను ఆకట్టుకునేలా ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. 3,4,5వ తరగతు లు అభ్యసిస్తున్న విద్యార్థులకు భాష, గణితంపై కృత్రిమ మేధ ఏఐ ద్వారా పాఠాలు బోధిస్తారని చెప్పారు. జిల్లాలో భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట, కాటారం మండలంలోని చింతకాని ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ విద్యాబోధన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి.

అనంతరం పదో తరగతి విద్యార్థులకు కలెక్టర్ ప్రేరణ కరపత్రాన్ని పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడొద్దని, బాగా రాయాలని మనో ధైర్యం నింపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి వారి మేధోశక్తిని పరిశీలించారు. త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. డీఈవో రాజేందర్, ఎంఈవో లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తహసీల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలి

ప్రజా సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు అన్ని తహసీల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. శనివారం ఐడీవోసీ కార్యాలయం నుంచి వివిధ అంశాలపై అన్ని శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యంత్రాంగం పరిపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పెండింగ్ ఫైల్స్ పరిష్కరించాలని, వచ్చే సోమవారం నుంచి ఉదయం 10:30 గంటల నుంచి అన్ని మండలాల్లో ప్రజావాణి నిర్వహించాలని ఆదేశించారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? ఎన్ని పరిష్కారం అయ్యాయి ? వాటి వివరాలు అందజేయాలని, జిల్లా కేంద్రంలో అధికారులు, మండల కేంద్రంలో అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. అంతేకాకుండా హాజరు నివేదిక అందజేయాలని స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి వారంలో కనీసం రెండు రోజులకు తగ్గకుండా మండలాలు, గ్రామాల్లో పర్యటించి సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, మెనూ అమలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఆసుపత్రుల్లో వైద్య సేవలు, సిబ్బంది సమయ పాలన, భోజన ఏర్పాట్లను తనిఖీ చేసి నివేదిక అందచేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ పాల్గొన్నారు.

గుర్రంపేట జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

చింతకాని ఉన్నత పాఠశాలలో..

కాటారం : చింతకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత విద్యా భోదన చేసేందుకు కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం డీఈవో రాజేందర్ ప్రారంభించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుకు ఏఐ బోధన ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఏఐతో మదింపు చేసి పురోగతి పరిశీలించి నివేదిక రూపొందిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, ఏఎంవో లక్ష్మణ్, హెచ్ఎంలు శైలజ, దేవునాయక్, ఉపాధ్యాయులు రాజబాబు, శారద, రవీందర్, జయరాజ్, రాజారాం, హారిక, రమేశ్, సురేశ్, రాజు పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలతో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

మృతుల కుటుంబాలకు కాకులమర్రి పరామర్శ

మంగపేట, మార్చి 15 : మండలంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు శనివారం పరామర్శించారు. మండలంలోని వాడగూడెంకు చెందిన వాసం చరణ్, కొత్త మల్లూరుకు చెందిన గోవర్ధన్, కమలాపురం గ్రామానికి చెందిన తలపనేని రాఘవయ్య, బాలన్నగూడెంకు చెందిన దన్నూరి సాయిలు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను ఆయన పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకుని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు గోవింద్‌నాయక్, మండలశాఖ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, నాయకులు బాడిష నాగరమేశ్, కర్రి శ్యాంబాబు, కొమురం రామ్మూర్తి, కూర్బాన్ అలీ, కొమురం ధనలక్ష్మి, కాడబోయిన నరేందర్, చిట్టిమల్ల సమ్మయ్య, తిరుపతి, గుడివాడ శ్రీహరి, శ్రీనావాసాచారి, పూజారి శ్రీను, నిమ్మగడ్డ ప్రవీణ్, తుక్కాని శ్రీను పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన జపాన్ దేశస్తులు

వెంకటాపూర్, మార్చి 15 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం జపాన్ దేశానికి చెందిన జపాన్ ఎంబసీ అధికారి రైతాసైటో, జపాన్ యూట్యూబర్స్ మయో, ఇండీ కర్రీలు సందర్శించారు. ఆలయ విశిష్టత, చరిత్రను టూరిజం గైడ్ ద్వారా తెలుసుకున్నారు. రామప్ప శిల్ప సంపద అద్భుతమని కొనియాడారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశాల గురించి జపాన్‌లో ప్రమోట్ చేయడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట టూరిజం, పురావస్తు, దేవాదాయ శాఖల సిబ్బంది ఉన్నారు.

శివాలయం చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు

వాజేడు, మార్చి 15 : మండలంలోని నాగారం శివాలయం 16యేళ్లుగా మూతపడి నిర్వహణకు నోచుకోవడం లేదు. దీంతో ఆలయం చుట్టూ పిచ్చిమొక్కలు, చెట్లు ఏపుగా పెరగడంతో గ్రామ యువకులు శనివారం తొలగింపజేశారు. ఓలేటి పవన్, జయరాజు, మాసారపు అశోక్, ఎస్‌కే సన్నీ, దేవులపల్లి హరిబాబు, ముత్యాల చందు, సిద్ధు, శ్యామల, పాలిశెట్టి రోహిత్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిట్యాల, మార్చి 15 : మండలంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్‌కు చెందిన మోత్కూరి కుమారస్వామి ఇటీవల మృతి చెందాడు. కాగా, శ్రీ లక్ష్మీనరసింహ అసోసియేషన్ డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించి రూ.15వేలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు ఈర్ల సహోదరు, ప్రధాన కార్యదర్శి జెట్టి రమేశ్, జంబుల రాజు, అన్న రాజు, కన్నవేణి రాయకొమురు, చిక్కుల నరేశ్, పర్లపెల్లి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అనుమతితోనే ఫైళ్ల తరలింపు

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ములుగు, మార్చి15 (నమస్తేతెలంగాణ) : జిల్లా కేంద్రంలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయం నుంచి తమ అనుమతితోనే ఫైళ్ల తరలింపు జరిగిందని కార్యాలయ సూపరింటెం డెంట్ ఎ కుమారస్వామి శనివారం వివరణ ఇచ్చారు. ' నమస్తేతెలంగాణ' దిన పత్రికలో శనివారం ' ప్రభుత్వ కార్యాలయం నుండి ఫైళ్ల తరలింపు' శీర్షికన మెయిన్‌లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎ సునిల్‌కుమార్ సంబంధిత రికార్డులను ముందస్తు అనుమతితో శుక్రవారం రాత్రి తీసుకొని శనివారం కరీంనగర్ జిల్లాలోని జేడీ కార్యాలయానికి తరలించి రసీదు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు వివిధ కార్యాలయాల నుంచి వచ్చే బిల్లులకు టోకన్ జనరేట్ చేసేందుకు పరిశీలన కోసం కరీంనగర్ జేడీ కార్యాలయానికి తరలించారని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

మహాముత్తారం, మార్చి 15: చదువుకు పేదరికం అడ్డు కాదని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని ములుగుపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం హెచ్ఎం పాశం సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించగా తహసీల్దార్ దండు శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని, విద్యార్థులు కష్టపడి చదివి 10 జీపీఏ సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మాజీ ఎంపీటీసీ రాధా రాజయ్య పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న వేషాలపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీ ప్రజలు

దాహం తీర్చండి మహాప్రభో..

ఖాళీ బిందెలతో భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట స్థానికుల నిరసన

భూపాలపల్లి రూరల్, మార్చి 15: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ముందు శనివారం స్థానికులైన వేషాలపల్లి డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్ అమర్చి మిషన్‌భగీరథ నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కలెక్టరేట్‌లోకి అధికారులు వెళ్లకుండా వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్‌రూం కాలనీ అధ్యక్షుడు మేర సురేశ్ మాట్లాడుతూ భూపాలపల్లి పట్టణంలోని వేషాలపల్లి డబుల్ బెడ్‌రూం కాలనీ ప్రజలు రెండేళ్లుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలనీలో నీటి సౌకర్యం కోసం ఐదు బోర్లు వేయగా, ఇందులో రెండు బోర్లలో నీరు అడుగంటడంతో ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. మూడు బోర్ల నుంచి మురికి నీరు వస్తుండడంతో దీనిని వినియోగించిన ప్రజలు రోగాల బారినపడుతున్నారని తెలిపారు. మొత్తం 544 కుటుంబాలకు గాను 300 కుటుంబ సభ్యులు ఇక్కడ నివసిస్తున్నామని, నీటి సౌకర్యం లేక పోవడంతో 70 కుటుంబాలు ఖాళీ చేసి వెళ్లిపోయారని అన్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు ఎన్నో సార్లు మొరపెట్టుకున్న సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

ఐదో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ నిరాహారదీక్షలు

మహదేవపూర్, మార్చి 15 : ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతే ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు శనివారం ఐదో రోజుకు చేరాయి. దీక్షలకు పలువురు నాయకులు మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ మాదిగ, మంథెన రవితేజ, వెమునూరి జక్కయ్య,చకినారపు తారా చందు, కన్నూరి గట్టయ్య, లింగాల ప్రభుకుమార్, బెల్లంపల్లి మల్లేశ్, లింగాల సుశాంత్ పాల్గొన్నారు. కాగా, ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చింతకుంట్ల సదానందంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.